తుదిదశకు కమ్యూనిటీ హాల్

మధురానగర్(విజయవాడసెంట్రల్): రజకుల కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు తది దశకు చేరాయి. దీంతో రజకుల దశాబ్దాల కల నెరవేర నుంది. రజకుల కోసం ప్రత్యేకంగా కమ్యూనిటీ హాలు నిర్మించాలని చాలా కాలం నుంచి కోరుతున్నారు. పేద, మధ్యతరగతి వర్గాల రజకులు అధికంగా ఉన్న దుర్గాపురంలో శుభకార్యాలు చేసుకునేందుకు హాల్ లేక ఇబ్బందులు పడుతున్నారు. వీరు శుభకార్యాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడంతోపాటు అధిక చార్జీలు చెల్లించాల్సి వస్తోంది. దీంతో స్థానికనికులు, కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే మల్లాది విష్ణు 27వ డివిజన్ దుర్గాపురంలో రూ.55.85 లక్షల వ్యయంతో రజక కమ్యూనిటీ హాల్ (కల్యాణ మండపం) నిర్మించేందుకు నిధులు మంజూరు చేయించారు. ఆరు నెలల క్రితం హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం, తర్వాత వెంటనే పనులు ప్రారంభమయ్యాయి. లోపల హాల్‌తోపాటు రెండు గదులు నిర్మించారు. వంట చేసుకునేందుకు కూడా సదుపాయాలు అమర్చారు. ఈ పనులు ప్రస్తుతం చివరి దశకు వచ్చాయి. ఎలక్ట్రికల్ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. సాధ్యమైనంత త్వరలో పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు.


దుర్గాపురంలోని చిట్యాల ఐలమ్మ కమ్యూనిటీ హాల్

ఆనందంగా ఉంది


రజకుల కోసం ప్రత్యేక కమ్యూనిటీ హాల్ (కల్యాణ మండపం) నిర్మించాలని కోరుతున్నాం. మా కోరిక ఇప్పటికి నెరవేరబోతోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిర్మించటం ఆనందంగా ఉంది.

–సగ్గుర్తి రాఘవులు, దుర్గాపురం

కల నెరవేరుస్తున్నాం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇచ్చిన మాట ప్రకారం రజకుల 40 ఏళ్ల కల అయిన కమ్యూనిటీ హాల్ (కల్యాణ మండపాన్ని) తన హయాంలో పూర్తి చేయనుండటం ఆనందంగా ఉందని 27వ డివిజన్ కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి అన్నారు. 27వ డివిజన్ దుర్గాపురంలో నిర్మిస్తున్న చిట్యాల ఐలమ్మ సామాజిక భవనం(రజక కల్యాణ మండపం)ను ఆదివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె నిర్మాణ పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశించిన సమయంలో పనులు పూర్తిచేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో రజక నాయకులు రాము, డాక్టర్ మల్లంపల్లి శ్రీనివాస రావు, ప్రభుకుమార్ తదితరులు పాల్గొన్నారు.


పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ మల్లీశ్వరి


తిరువూరులో ఆదివారం జరిగిన 'జగనన్న విద్యా దీవెన' కార్యక్రమానికి హాజరైన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే మల్లాది విష్ణు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు. సీఎం జగన్ ఆయనకు శాలువా కప్పి సత్కరించారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

క్లుప్తంగా

వీఎంసీలో నేడు స్పందన

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని ఆయా డివిజన్లలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి జరిగే స్పందనను వినియోగించుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగర ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు, అర్జీలు స్వీకరించడానికి వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్పందన జరుగుతుందని పేర్కొన్నారు. చిట్టినగర్‌లోని సర్కిల్-1, సత్యనారాయణపురంలోని సర్కిల్-2, పటమటలోని సర్కిల్-3 కార్యాలయంలో అర్జీలు తీసుకుంటారని వివరించారు.

సంపూర్ణ ఆరోగ్యానికి సూర్యనమస్కారాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సంపూర్ణ ఆరోగ్యం కోసం నిత్యం సూర్యనమస్కారాలు చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమలపూర్ణమ్మ అన్నారు. ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఆదివారం చిన్నారులకు సూర్యనమస్కారాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సరస్వతీ సామ్రాజ్య ఆధ్వర్యంలో గోవింద నామ ప్రచార సేవా ట్రస్ట్ సభ్యులు సునీత చిన్నారులకు సూర్య నమస్కారాలు, యోగాసనాలు నేర్పించారు. జమల పూర్ణమ్మ మాట్లాడుతూ సూర్య భగవానుడు ప్రత్యక్ష దైవమని పేర్కొన్నారు. దేహాన్ని ఆరోగ్యంగా తీర్చిదిద్దుకునేందుకు నిత్యం 12 సూర్య నమస్కారాలను సాధన చేయాలన్నారు. సూర్యభగవానుని శ్లోకాలు పఠించాలన్నారు. ప్రతి ఒక్కరికీ శారీరక వ్యాయామం ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి కె.రమాదేవి, ధనలక్ష్మి, ఫణి బాబు, గోపాలరావు, దుర్గమ్మ వివిధ స్కూల్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

భగీరథునికి నివాళి


మధురానగర్(విజయవాడసెంట్రల్): భగీరథుని ఆశీస్సులతో ఇంద్రకీలాద్రి ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా నియమితులైన కర్నాటి రాంబాబు మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని వైఎస్సార్ సీపీ బీసీ నాయకులు ముద్రబోయిన దుర్గారావు, నారాయణ, దాలి బుజ్జి, నక్కా గోవిందు, కడవకొల్లు వెంకటేశ్వరరావు ఆకాంక్షించారు. ఆదివారం అంబేడ్కర్ కాలనీలోని భగీరథుని విగ్రహానికి పూలమాల వేసి వారు నివాళులర్పించారు.

చిన్నారులను లైంగికంగా వేధిస్తే కఠిన చర్యలు

పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్

సాక్షి, అమరావతి: పోక్సో చట్టం, చిన్నారులపై లైంగిక వేధింపుల కేసులకు సంబంధించిన క్రమశిక్షణ కేసుల్లో సకాలంలో కఠిన చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ ఆర్జేడీలు, జిల్లా విద్యాశాఖాధికారులకు ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. 'పిల్లల లైంగిక వేధింపుల కేసుల్లో సస్పెండ్ అయిన ఉపాధ్యాయులను విచారణ, ఇతర క్రమశిక్షణ చర్యలు పూర్తయ్యే వరకు తిరిగి విధుల్లోకి తీసుకోవద్దు' అని పేర్కొన్నారు. ఇలాంటి కేసుల్లో న్యాయస్థానాల ఆదేశాలను గౌరవిస్తూ చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎస్‌వోపీలు, పోస్టర్లు, వీడియో మాడ్యూల్స్ తదితర వాటి ద్వారా పిల్లలకు అవగాహన సామర్థ్యం పెంపొందించాలని, 'గుడ్ టచ్.. బ్యాడ్ టచ్', ఎవరిని సంప్రదించాలి? అలాంటి సంఘటనలకు ఎలా ప్రతిస్పందించాలి? వంటి వాటిపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. పోస్టర్లు, ఫిర్యాదు బాక్సు ఏర్పరచడం, పాఠశాలల్లో, పాఠశాల చుట్టు పక్కల ప్రదర్శించడం, అవగాహన కార్యక్రమాలు వంటివి నిర్వహించాలని తెలిపారు.

వేసవిలో జంతువులు, పక్షులకు నీటిని అందించండి


చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వేసవిలో జంతువులు, పక్షులకు నీటిని అందించడానికి ప్రతి ఒక్కరూ వీధుల్లో, మేడలపై తొట్టెలు, డబ్బాలను ఏర్పాటు చేయాలని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఠాగూర్ పేర్కొన్నారు. జీవకారుణ్యం ఆశ్రమం ఆధ్వర్యంలో ఆదివారం జంతు ప్రేమికులకు నీటి తొట్టెల పంపిణీ కార్యక్రమం భవానీపురం ఐరన్ యార్డ్‌లోని కార్యాలయం వద్ద నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ ఠాగూర్, మున్సిపల్ కార్పొరేషన్ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ రవిచంద్ర, పశుసంవర్ధక శాఖ సర్జన్ డాక్టర్ శ్రీనివాసరావు విచ్చేశారు. జంతు ప్రేమికులు వేసవిలో వాటికి నీటిని అందించేందుకు సిమెంటు తొట్టెలను అందచేయడం అభినందనీయమన్నారు. జీవకారుణ్యం చైర్మన్ మురాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన పంపిణీ కార్యక్రమానికి విజయవాడలోని పలు ప్రాంతాల నుంచి పలువురు జంతుప్రేమికులు నీటి తొట్టెలను అందుకున్నారు.

వృద్ధులను ఆదరించడం సామాజిక బాధ్యత

మధురానగర్(విజయవాడసెంట్రల్): వృద్ధులను ఆదరించడం సామాజిక బాధ్యత అని ఎవరూ పట్టించుకోని 70 సంవత్సరాలు దాటిన వయోవృద్ధులను గుర్తించి వారికి ప్రతినెలా నిత్యావసర సరుకులు అందజేయటం అభినందనీయమని ఆర్థోపెడిక్ వైద్యులు ఎం జే నాయుడు అన్నారు. దుర్గాపురం విజయ్ నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన దాత సంజయ్‌కుమార్ మెహతా సహకారంతో వయోవృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 188 నెలలుగా సేవలు అందిస్తున్న వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ సభ్యుల సేవలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని సేవా కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు. తాను కూడా ట్రస్ట్‌కు అవసరమైన సహాయ సహకారాలు ఇస్తానని, ఇక్కడి వయోవృద్ధులకు ఉచిత వైద్యసేవలు అందిస్తానని హామీ ఇచ్చారు. గౌరవ అతిథి యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ రిటైర్డ్ ప్రొఫెసర్ చంద్రశేఖరరావు, సీ ఛానల్ ఎండీ, హాత్‌వే డిస్ట్రిబ్యూటర్ రమేష్ బాబు మాట్లాడుతూ ఇంత మంచి సేవా కార్యక్రమంలో పాల్గొనే అవకాశం లభించటం ఆనందంగా ఉందన్నారు. వయోవృద్ధులకు నిత్యావసర సరుకులతో పాటు హోమియో, ఆయుర్వేదం, అల్లోపతి వైద్యులతో ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేయటం అభినందనీయమన్నారు. ట్రస్టీ, మురళీ ఫర్న్యూస్ అధినేత ముత్తవరపు మురళీకృష్ణ, తట్టి అర్జునరావు ట్రస్ట్ సేవలను వివరించారు. అనంతరం నిత్యావసర సరుకులు, అన్నసంతర్పణ సమితి ఆధ్వార్యన అల్పాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టీ కె. మధుసూదన రావు, అన్నసంతర్పణ సమితి ట్రస్ట్ గుండు దిలీప్ తదితరులు పాల్గొన్నారు.


వయోవృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

తల్లిదండ్రులకు అండగా నిలవాలి


అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): తమకు జీవితాన్ని ఇచ్చి, పెంచి పెద్ద చేసి ప్రయోజకులను చేసిన కన్న తల్లిదండ్రులకు వృద్ధాప్యంలో అండగా ఉండాల్సిన బాధ్యత సమాజంలో అందరి పిల్లలపై ఉందని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షులు షేక్ నాగుల్‌మీరా అన్నారు. వాంబేకాలనీలోని మాతృదేవోభవ వృద్ధుల ఆశ్రమంలోని వృద్ధులకు ఆ కమిటీ ఆధ్వర్యాన ఆదివారం ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో వృద్ధులు వివక్షకు గురవుతున్నారని, వారి కుటుంబ సభ్యులే రోడ్లపై వదిలేయడం, ఆశ్రమాల్లో చేర్పించడం బాధాకరమన్నారు. ఏఎంసీ నాయకులు ఎండీ కాలేషా, సయ్యద్ మౌలాలి, షేక్ షాకీర్, షేక్ మస్తాన్, షేక్ రఫీ, మునీర్ అహ్మద్, సైఫ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఉచిత బ్లడ్ గ్రూప్ నిర్ధారణ శిబిరం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య మున్సిపల్ స్టేడియంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో క్రీడాకారులకు ఉచిత బ్లడ్ గ్రూప్ నిర్ధారణ శిబిరాన్ని ఆదివారం ఏర్పాటుచేశారు. డీవైఎఫ్ఐ సెంట్రల్ సిటీ అధ్యక్ష కార్యదర్శులు యు.శివలింగేశ్వరరావు, షేక్ నిజాముద్దీన్ మాట్లాడుతూ భగత్‌సింగ్ ఆశయాలు యువతకు ఆదర్శనీయమని, నేటి యువత ఆయన స్ఫూర్తితో జీవితంలో రాణించాలని పిలుపునిచ్చారు. 23న భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నగరంలోని అన్ని వార్డుల్లో సేవా కార్యక్రమాలను చేస్తున్నట్లు వివరించారు. సంఘ నాయకులు రవి, ఎస్‌కే రసూల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులు, వాకర్స్‌కు రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కళాకారులను ప్రోత్సహించాలి

విజయవాడ కల్చరల్: కళాకారుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణమూర్తి అన్నారు. శ్రీ సరస్వతీ కళాపీఠం, తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి చారిటబుల్ సంస్థ ఆధ్వర్యంలో ఉగాది వేడుకల సందర్భంగా గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికపై ఆదివారం ఉగాది వేడుకలు, వివిధ జిల్లాలనుంచి వచ్చిన గాయనీ గాయకులకు ఆత్మీయ సత్కారం, సినీ సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కళాకారుల సాంస్కృతిక వారధులని వారి సేవలను వినియోగించుకోవాలన్నారు. సాంస్కృతిక కళా సంస్థలు కళాకారుల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. సీనియర్ గాయకుడు తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో కొమ్మినేని రత్నకుమారి, చందన, వడ్డాది కామేశ్వరి, మాధవి, కొప్పరపు ఉమాబలరాం పలు చిత్రగీతాలను మధురంగా ఆలపించారు. మధిర రోజా ప్రసన్న ఈల పాటతో అలరించారు. వెంకటేశ్వర కళాపీఠం వ్యవస్థాపకుడు పీసుపాటి సుబ్రహ్మణ్య శాస్త్రి పాల్గొన్నారు.

మాతృప్రేమ.. అనంతం

విజయవాడ కల్చరల్: మాతృప్రేమ అనంతమైనదని దానికి పరిమితిలేదని ఆకాశవాణి విశ్రాంత సంచాలకురాలు ముంజులూరి కృష్ణకుమారి అన్నారు. హాస్యానందం మాసపత్రిక దండెరాజు ఫౌండేషన్ ఆధ్వర్యాన గవర్నర్‌పేటలోని బుక్ ఫెస్టివల్ సొసైటీ హాల్లో ఆదివారం సాహితీవేత్త జాంబవతి జ్ఞాపకార్థం గుత్తికొండ లక్ష్మికి బంగారు తల్లి పురస్కారం, హాస్యానందం మాసపత్రిక నిర్వహించిన కథల పోటీ విజేతలు, కార్టూన్ పోటీ విజేతలకు బహుమతి ప్రదానోత్సవ సభను నిర్వహించింది. కృష్ణకుమారి మాట్లాడుతూ మాతృదేవోభవ అన్న సూక్తిని నిజం చేస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్న హాస్యానందం నిర్వాహకుడు రాము పండా సేవలను కొనియాడారు. తెలుగు సంస్కృత అకాడమీ సభ్యుడు డాక్టర్ కప్పగంతు రామకృష్ణ మాట్లాడుతూ విలువలతో కూడిన కార్యక్రమాలు నిర్వహిస్తూ, యువ కథకులను, కార్టూనిస్టులను ప్రోత్సహిస్తున్న హాస్యానందం సంపాదక వర్గాన్ని అభినందించారు. కార్యక్రమంలో ప్రముఖ చిత్రకారుడు, కార్టూనిస్ట్ బ్నిం, సీనియర్ చిత్రకారుడు ఏవీఎం, కార్టూన్ రంగానికి చెందిన కేవీవీ సత్యనారాయణ, దండెంరాజు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ డీఎస్‌వీ రామశర్మ, డాక్టర్ వీవీ రాంకుమార్ పాల్గొన్నారు. అమ్మాయే నవ్వితే అంశంగా నిర్వహించిన కథల పోటీ విజేతలకు, కార్టూన్ పోటీ విజేతలకు బహుమతులను అందజేశారు.


గుత్తికొండ లక్ష్మికి బంగారుతల్లి పురస్కారం ప్రదానం చేస్తున్న కృష్ణకుమారి తదితరులు

త్రిశక్తి పీఠంలో దక్షిణామూర్తి హోమం

కృష్ణలంక(విజయవాడతూర్పు): పదో తరగతి, ఇంటర్ విద్యార్థుల పరీక్షా సమయాన్ని దృష్టిలో ఉంచుకుని బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో ఆదివారం శ్రీసరస్వతీ సహిత మేధా దక్షిణామూర్తి హోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన హోమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు సరస్వతీ దేవికి పూజలు చేశారు. అనంతరం పూర్ణాహుతి జరిగాంది. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

విద్యార్థుల ఉన్నతికి కృషి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): విద్యార్థుల ఉన్నతికి కృషి చేస్తున్న గౌతమ్ విద్యాసంస్థ సేవలు అభినందనీయమని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. చిట్టినగర్ శ్రీ గౌతమ్ విద్యా సంస్థల సిల్వర్ జూబ్లీ వేడుకలు ఆదివారం శ్రీ మహాలక్ష్మి కల్యాణ మండపంలో నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథులుగా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, అధికార భాషా సంఘం, చైర్మన్ విజయ్‌బాబు విచ్చేశారు. తొలుత జ్యోతి ప్రజ్వలన అనంతరం సరస్వతీదేవి చిత్రపటానికి అతిథులు పూలమాల వేసి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్కూల్ డైరెక్టర్ నల్లాని సూర్యారావు అధ్యక్షతన నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్కూల్ ఇన్‌చార్జి తులసి, శ్రీరామ్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మంత్రి కారుమూరికి జ్ఞాపికను అందజేస్తున్న సూర్యారావు, వెలంపల్లి తదితరులు

నడకతో అనారోగ్య సమస్యలు దూరం

కృష్ణలంక(విజయవాడతూర్పు): నడకతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని, వివిధ ఆరోగ్య సమస్యలు దూరమవుతాయని వాకర్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.పి. రవీంద్ర అన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో విజయవాడ వాకర్స్ అసోసియేషన్ 24వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ చదువుతున్న ఉత్తమ పేద విద్యార్థులకు ఆర్థికసాయం చేశారు. రవీంద్ర మాట్లాడుతూ దేశ భవిష్యత్‌కు నేటి విద్యార్థులే పునాదని, ఉత్తమ విలువతో విద్యనభ్యసించి ప్రపంచ స్థాయిలో అవకాశాలు అందిపుచ్చుకుని ఉన్నత స్థితికి ఎదగాలన్నారు. నడకతో ఆరోగ్య ప్రయోజనాలను గుర్తించి 32ఏళ్ల క్రితం విశాఖ కేంద్రంగా వాకర్స్ ఇంటర్నేషనల్ ఆవిర్భావం జరిగిందని గుర్తు చేశారు. లయన్స్, రోటరీ వంటి సేవా సంస్థలకు దీటుగా సామాజిక సేవలో నడక సంఘాలు ముందున్నాయన్నారు. విజయవాడ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మోటూరి ప్రభాకర్ మాట్లాడతూ పర్యావరణ, ప్లాస్టిక్ నివారణ, మెడికల్ క్యాంపులు నిర్వహణ వంటి అనేక కార్యక్రమాలు చేస్తున్నట్లు వివరించారు. అనంతరం నడక-ఆరోగ్యం పత్రికను ఆవిష్కరించారు. పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

'స్వచ్ఛంద ' సేవలు సమాజానికి అవసరం

పాయకాపురం(విజయవాడరూరల్): స్వచ్ఛంద సేవా సంస్థల కార్యక్రమాలు సమాజానికి అవసరమని విభిన్న ప్రతిభావంతుల, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్ సంక్షేమశాఖ అసిస్టెంటు డైరెక్టర్ బి.రామ్‌కుమార్ అన్నారు. మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన ప్రశాంతినగర్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వక్తృత్వ, వ్యాస రచన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఆదివారం ప్రశంసా పత్రాలు, నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ సందర్భంగా బి.రామ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతులకు అందజేస్తున్న పథకాలకు తోడు స్వచ్ఛంద సేవా సంస్థల సేవా కార్యక్రమాలు వారి అభివృద్ధికి తోడ్పాటు అందిస్తాయన్నారు. అనంతరం విభిన్న ప్రతిభావంతులకు ఉగాది సందర్భంగా నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. సీనియర్ సిటిజన్ ఫోరం కానూరు వారు అందచేసిన బియ్యాన్ని వృద్ధాశ్రమ నిర్వాహకులకు అందించారు. మానవత స్వచ్ఛంద సంస్థ ఉపాధ్యక్షులు ఇమ్మనేని కృష్ణప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్యదర్శి రామ్మోహనరావు, చైర్మన్ సీబీజీ బాబు, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ ప్రతినిధులు, వెంకటేశ్వరావు, శ్రీనివాస్, లీగల్ అడ్వైజర్ పి.రాము, స్పందన సేవా సమితి సభ్యులు యశోద, సుజాత తదితరులు పాల్గొన్నారు.


ప్రశంసా పత్రాలు, నగదు అందజేస్తున్న బి.రామ్‌కుమార్

ఉచిత వైద్య సేవలు వినియోగించుకోండి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ ఆరోగ్య నియమాలు పాటించాలని, ఉచిత వైద్య సేవలు వినియోగించుకోవాలని 27వ డివిజన్ కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి, జిల్లా వాకర్స్ క్లబ్ గవర్నర్ రామలింగరాజు అన్నారు. దుర్గాపురం 19వ వార్డు సచివాలయం సమీపంలో ఆదివారం బీఆర్టీఎస్ వాకర్స్ క్లబ్, డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందజేయాలనే ఉద్దేశంతో ఉచిత వైద్య సేవలు అందించటం అభినందనీయమన్నారు. డాక్టర్ బండ్రెడ్డి గౌతమ్ సుమారు 300 మందికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. బీపీ, షుగర్, లిపిడ్ ప్రొఫైల్ తదితర రక్త పరీక్షలు ఉచితంగా చేశారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ కేబినెట్ కార్యదర్శి పీవీడీ ప్రసాద్, కోశాధికారి సాయి బాబు, వాకర్స్ క్లబ్ అధ్యక్షులు గుర్రం ఏడు కొండలు, ప్రధాన కార్యదర్శి కొండాయగుంట రాము, కోశాధికారి డాక్టర్ బ్రహ్మ దేశం వసంత కుమార్, శ్యామ్, బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ గౌతమ్

రౌడీషీటర్లు గొడవల్లో ఉంటే జైలుకే

సెంట్రల్ జోన్ ఏసీపీ ఎస్‌కే ఖాదర్‌బాషా

ఆటోనగర్(విజయవాడతూర్పు): గొడవలు సృష్టించడం... ఇందులో ప్రమేయం ఉంటే జైలుకు పంపిస్తామని విజయవాడ సెంట్రల్ జోన్ ఏసీపీ ఎస్‌కే ఖాదర్‌బాషా రౌడీషీటర్లను హెచ్చరించారు. ఆదివారం ఫస్‌టైమ్స్ రోడ్డులోని ఏసీపీ కార్యాలయం ఆవరణలో రౌడీషీటర్‌లకు ఆయన కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీరు మంచిగా ఉండాలని, మీ ప్రవర్తన మార్చుకోవాలి లేకపోతే రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపించాల్సి ఉంటుందని హెచ్చరించారు. గంజాయి అమ్మడం.. తాగడం లాంటివి చేయకూడదని సూచించారు. మద్యం షాపుల వద్ద గొడవలు చేయకూడదన్నారు. మీ ప్రాంతాల్లో ఏవైనా సంఘటనలు జరిగితే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. మీ పద్ధతి మార్చుకుంటే ఏడాది తర్వాత రౌడీషీట్‌లను తొలగిస్తామన్నారు. కుటుంబ అభివృద్ధికి బంగారు బాటలు వేసుకోవాలని వారిని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఐ కాశీవిశ్వనాథ్, ఎస్సైలు జాన్‌బాషా, వల్లి పద్మ, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోటి రుద్రాక్ష అభిషేకానికి రూ.50 వేల విరాళం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు సాయిబాబా మందిరంలో ఈనెల 28న చేయనున్న కోటి రుద్రాక్ష అభిషేకానికి ఆదివారం ఏపీ కోఆపరేటివ్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు కె.బాలాజీ ప్రసాద్ రూ. 50 వేల విరాళాన్ని మందిర గౌరవాధ్యక్షులు గౌతంరెడ్డి చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా గౌతంరెడ్డి మాట్లాడుతూ ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కాంక్షిస్తూ కోటి రుద్రాక్షాభిషేకం ఏర్పాటు చేశామన్నారు. దాత బాలాజీ ప్రసాద్ మాట్లాడుతూ ఇంత మంచి కార్యక్రమంలో తాము భాగస్వామి అయ్యే అవకాశం రావటం ఆనందంగా ఉందన్నారు. అలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి బాబావారి శేషవస్త్రం చిత్రపటంతో దాతలను సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


దాతలను సత్కరిస్తున్న గౌతంరెడ్డి

• నగరంలో 'బలగం'


నగరంలోని ట్రెండ్ సెట్ మాల్‌లో ఆదివారం బలగం చిత్ర యూనిట్ సందడి చేసింది. దర్శకుడు వేణు, ప్రియదర్శి, కావ్యకల్యాణ్‌రామ్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్ విజయవాడ

వెంకటరత్నం సేవలు ఎనలేనివి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడ సెంట్రల్): నగర ప్రజలకు కామ్రేడ్ చలసాని వెంకటరత్నం అందించిన సేవలు ఎనలేనివని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వర రావు అన్నారు. చలసాని వెంకటరత్నం 51వ వర్ధంతి కార్యక్రమం సీపీఐ 60, 61 డివిజన్ల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం వాంబేకాలనీలో జరిగింది. తొలుత చలసాని వెంకటరత్నం తనయుడు చలసాని అజయ్, సీపీఐ నాయకులతో కలిసి వెంకటరత్నం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించి, విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ చేశారు. సీపీఐ నాయకులు కె.రామరాజు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ అందజేస్తున్న కోటేశ్వరరావు, అజయ్‌కుమార్